క్లుప్తంగా

డబుల్ ఇళ్ల డ్రా రద్దు చేయండి



నిరసన తెలుపుతున్న మాజీ కార్పొరేటర్లు

రామగుండం: డబుల్ ఇళ్ల కేటాయింపునకు నిర్వహిస్తున్న లక్కీడ్రా రద్దు చేయాలని మాజీ కార్పొరేటర్లు, ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. గతంలో ఎంపికచేసిన 160 మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించి.. మిగిలిన ఇళ్లకు డ్రా నిర్వహించాలని బుధవారం రామగుండం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఆరేళ్ల క్రితం నిరుపేదలను గుర్తించి అధికారుల సమక్షంలో డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేశారని, ప్రస్తుతం ఆ జాబితా చెల్లుబాటు కాదనడం సరికాదన్నారు. ప్రజాపంథా జిల్లా కన్వీనర్ గుజ్జుల సత్యనారాయణరెడ్డి, జూపాక శ్రీనివాస్, గుమ్మడి వెంకన్న, తోకల రమేష్, పెండ్యాల రమేష్‌తో పాటు మాజీ కార్పొరేటర్లు రవి, సత్యప్రసాద్, బాబా తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: మండలంలోని లక్కేపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మండల రైతుసమితి మాజీ అధ్యక్షుడు మేదరవేణ పర్వతాలు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పేదలకు న్యాయం చేస్తుందని, తప్పుడు ప్రచారాలు పట్టించుకోవద్దని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో నగునూరు ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని సర్పంచ్ కంకణాల భారతి జ్యోతిబసు ప్రారంభించారు. గ్రామస్తులువైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పరీక్షలు చేయించుకున్న వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భం గా వైద్యకళాశాల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. వార్డుసభ్యులు తీగల అశోక్ గౌడ్, భాగ్య మహేశ్, శాంతన్‌రెడ్డి, యుగేందర్, ప్రతిమ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

హెల్త్‌సెంటర్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ లత

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాల గ్రామంలో నిర్మిస్తున్న వెల్నెస్ సెంటర్ పనులను బుధవారం ఎంఎల్‌హెచ్‌పీ లత, సర్పంచ్ లావణ్యతో కలిసి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని హెల్త్‌సెంటర్ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వారివెంట ఏఈ గణపతి సిబ్బంది ఉన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



నారాయణను సన్మానిస్తున్న గ్రామస్తులు

రామగిరి: మండలంలోని లద్నాపూర్‌కు చెందిన తాళ్లపల్లి నారాయణ బహుజన రైటర్స్ 6వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ సందర్భంగా సాహిత్య కళారంగంలో లైఫ్‌టైం అచీవ్‌మెంట్ జాతీయ అవార్డు పొందగా బుధవారం గ్రామస్తులు సన్మానించారు. గ్రామంలోని శ్రీగోదారంగనాయక స్వామి ఆలయం వద్ద శ్రీ గోదారంగనాయక స్వామి, కోదండ రామాలయం భజన మండలి ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కళాకారులు, అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు.

భద్రత వారోత్సవాలు

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియా సివిల్ విభాగంలో భద్రత వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు రక్షణపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య, ఏరియా రక్షణ అధికారి బండి సత్యనారాయణ, డీవైఎస్ఈ వసంత్ కుమార్ పాల్గొన్నారు.

జీపీలకు పక్కా భవనాలు

- ఈజీఎస్ నిధులతో భవన నిర్మాణాలకు కసరత్తు
- నాలుగు నూతన, మూడు పాత పంచాయతీలకు నూతన భవనాలు
- ఒక్కో భవనానికి రూ.20లక్షలు మంజూరు



పన్నూరులో నిర్మిస్తున్న నూతన పంచాయతీ భవనం

రామగిరి: పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటుచేసిన నూతన జీపీ కార్యాలయాలకు పక్కా భవనాలు మంజూరయ్యాయి. వాటి నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉపాధిహామీ నిధులతో జీపీ భవన నిర్మాణాలు చేపట్టనున్నారు. ఒక్కో భవనానికి రూ. 20లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. నూతన భవన నిర్మాణాలతో పాలకవర్గాల కష్టాలు తీరనున్నాయి. రామగిరి మండలం పరిధిలో 17 జీపీలుండగా వీటిలో ఏడు జీపీలకు నూతన భవనాలకు నిధులు మంజూరయ్యాయి. వీటిలో నూతనంగా ఏర్పడిన 5 గ్రామ పంచాయతీలు నవాబ్‌పేట,రాజాపూర్, చందనాపూర్, పన్నూరు గ్రామాల్లో పక్కా భవనాలు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలు, అద్దె ఇళ్లల్లో పాలకవర్గ సభ్యులు విధులు నిర్వహిస్తు అరకొర సౌకర్యాల మధ్య ఆరుబయట సమావేశాలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. పూర్తిగా శిథిలావస్థకు చేరిన పాత గ్రామ పంచాయతీలైన కల్వచర్ల, నాగేపల్లి, బుధవారంపేట(రామయ్యపల్లి)లలో నూతనంగా జీపీ భవనాలు నిర్మించనున్నారు. దీంతో ఆయా పంచాయతీల పాలకవర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

లొంకకేసారానికి మొండి చెయ్యి...

మండలంలోని కల్వచర్ల నుంచి నూతనంగా ఏర్పడిన లొంకకేసారంలో నూతనంగా గ్రామపంచాయతీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. భవన నిర్మాణాలకు నిధులు మంజూరుచేసి లొంకకేసారం విషయంలో పక్షపాతం వహించడంతో గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పూర్తిస్థాయిలో శిథిలావస్థ కు చేరి మూతపడిన ప్రభుత్వ పాఠశాల భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయ తీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల ని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



విద్యార్థులను తనిఖీచేస్తున్న అధ్యాపకులు

మంథని/సుల్తానాబాద్/కాల్వశ్రీరాంపూర్/కమాన్‌పూర్/ఓదెల/రామగిరి: పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లో బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 389 మందికి 11 మంది గైర్హాజరైనట్లు సీఎస్ ప్రభాకర్, డీవో రమేశ్ తెలిపారు. శ్రీవాణి జూనియర్ కళాశాలలో 322 మందికి 10 మంది గైర్హాజరైనట్లు డీవో కిషన్, సీఎస్ అశోక్‌రెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఇంటర్ నోడల్ అధికారి కల్పన, సుల్తానాబాద్ తహసీల్దార్ యాకన్న పరిశీలించారు. కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 159 మంది విద్యార్థులకు 9 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ విశ్వప్రసాద్ తెలిపారు. కమాన్‌పూర్ మండలంలోని గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 176 మందికి ఏడుగురు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సునంద తెలిపారు. మంథని బాలికల కళాశాలలో 227 మందికి 28 మంది, బాలుర కళాశాలలో 186కు 20 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఓదెల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 162 మంది పరీక్షలు రాయగా ఆరుగురు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. రామగిరి ముత్తారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్, కేజీబీవీలోని పరీక్షకేంద్రంలో 237 మంది విద్యార్థులకు 9 మంది గైర్హాజరయ్యారు. సీఎస్‌గా ఎల్ఎన్.రావు, డీవోగా శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షించారు. పరీక్షకేంద్రాన్ని సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లైయింగ్ స్క్వాడ్, తహసీల్దార్ వరంధన్, ఎస్సై బేతి రాములు సందర్శించి తనిఖీ చేశారు.

అనాథ ఆశ్రమానికి టీవీ బహూకరణ



టీవీని బహూకరిస్తున్న విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: స్థానిక శ్రీరామ విద్యానికేతన్‌కు చెందిన విద్యార్థులు తమ తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీని పోగుచేసి గాంధీనగర్‌లోని ఎండీహెచ్‌డబ్ల్యూఎస్ బాలల సంరక్షణ సంస్థకు బుధవారం రూ.22వేలు విలువైన ఎల్ఈడీ టీవీని బహూకరించారు. కార్యక్రమంలో శ్రీరామ విద్యానికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ సూర్యదేవర జ్యోతి, ఆశ్రమ నిర్వాహకులు పోచంపల్లి రాజయ్య, నీడ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు రమేశ్‌గౌడ్, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు లక్ష్మీగౌతమి, వర్షిణి, ప్రజ్వల్, సంజన, సాయిష్మా, జాషువా విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను ఆదరించాలి



చిన్నారిని ఆశీర్వదిస్తున్న సర్పంచ్ పద్మ

రామగిరి: చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆదరించాలని సర్పంచ్ బుర్ర పద్మ కోరారు. మండలంలోని బేగంపేట 6వ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయించారు. అంగన్‌వాడీటీచర్ టి.సుమత, హెల్పర్ సత్తెమ్మ గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడికి సన్మానం



శ్రవణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న మహిళలు

కోల్‌సిటీ: గోదావరిఖని శారదానగర్‌లోని విశ్వహిందూ పరిషత్ కమ్యూనిటీ హాల్‌లో సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు టి.శ్రవణ్‌కుమార్‌ను, బుధవారం పలువురు మహిళా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కమ్యూనిటీ హాల్‌లో యోగా శిక్షణ పొందుతున్న మహిళలకు జ్యోతి, అన్నపూర్ణ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణపొందుతున్న మహిళలకు నేత్ర, అవయవ, శరీర దానాలపై శ్రవణ్ కుమార్ అవగాహన కల్పించారు. కాగా, సదాశయ ఫౌండేషన్ ద్వారా టి.శ్రవణ్‌కుమార్ చేపడుతున్న సేవలకు ఇటీవల ఢిల్లీలో దధీచి పురస్కారం, విజయవాడలో నంది పురస్కారం, రాజస్థాన్‌లో గ్లోబల్ హ్యూమానిటీ చేంజ్ మేకర్ అవార్డు పొందిన సందర్భంగా శ్రవణ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జ్యోతి, శారద, అన్నపూర్ణ, తిరుమల, లలిత, భవానీ, మమత, రజిత, ఇందిర పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జున స్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న ఒగ్గు పూజారులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం శ్రీ నాగ మల్లేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మల్లన్న కల్యాణం(మల్లన్న పట్నాలు) ఒగ్గు పూజారులు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

‘పుట్ట’ దంపతులకు సన్మానం



సన్మానిస్తున్న రైతులు

మంథని: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఖానాపూర్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ. 1.50 కోట్లు మంజూరు చేయించినందుకు బుధవారం రైతులు జెడ్పీచైర్మన్ పుట్టమధు దంపతులను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. మంథని మండలం గద్దలపల్లి నుంచి ముత్తారం మండలం సీతంపల్లి వరకు రోడ్డు, వంతెన నిర్మాణానికి రూ. 1.85 కోట్లు మంజూరు చేయించినందుకు ధర్మారంలో రైతులు సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీచైర్మన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

కోడిపిల్లల యూనిట్ల పంపిణీ



కోడి పిల్లలను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కాల్వశ్రీరాంపూర్: మండలకేంద్రంలోని పశువైద్యశాలలో బుధవారం 38 కోడిపిల్లల యూనిట్లను లబ్ధిదారులకు ఎంపీపీ నూనేటి సంపత్, జెడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి పంపిణీ చేశారు. ఒక్కోయూనిట్ లో 25 కోడిపిల్లలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, సర్పంచ్ ఆడెపు శ్రీదేవి, పశువైద్యాధికారి సురేశ్ జేవీవో పాషా, పశుమిత్ర రమేశ్ వివిధ గ్రామల రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి



నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎలిగేడు/మంథని: బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతిని ఎలిగేడు మండల కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో, మంథనిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాన్షీరాం బడుగు, బలహీన వర్గాల కోసం పాటుపడిన మహానీయుడని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి బాలకల్యాణ్ పంజా, జిల్లా అధ్యక్షుడు గొట్టెరాజు, జిల్లా కార్యవర్గసభ్యులు కాంపెల్లి బాబు, మండల బీవీఎఫ్ కన్వీనర్ ఇరుగురాల సాగర్, మహిళ మండల అధ్యక్షురాలు శారద, కవ్వంపల్లి రాజు, కలువల అనిల్, రాజు, మహేశ్, అనిల్, శివ, రాకేశ్, వినయ్, బీవీఎఫ్ నాయకులు జిల్లా నాయకుడు తిరుపతి, నియోజకవర్గ ఇన్‌చార్జి జనగామ రవికుమార్, నాయకులు నాగరాజు ఏట సంపత్, రెనుకుంట్ల మల్లేష్, నర్సయ్య, లక్ష్మణ్, సదానందం, శ్యాం తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేయాలి



శ్రీనివాస్‌ను కలిసిన సతీశ్ గౌడ్

సుల్తానాబాద్: బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని జిల్లా సమన్వయ కర్త ఎర్రోళ్ల శ్రీనివాస్ తెలిపినట్లు జిల్లా సివిల్‌సప్లై మానిటరింగ్ కమిటీ మెంబర్ పడాల సతీశ్‌గౌడ్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ ఆయన నివాసంలో కలిశారు. బీఆర్‌ఎస్ గ్రామాల్లో, పట్టణంలో మరింత బలోపేతం చేయడానికి ప్రణాళికతో ముందుకు వెళ్లాలని కోరారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శివకుమార్ ఉన్నారు.

ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తే ?



సుల్తానాబాద్‌రూరల్: ఏళ్లు గడుస్తున్నా మహిళ సమైఖ్య భవనాలకు మోక్షం కలగడం లేదు. సుల్తానాబాద్ మండలంలోని ఐతరాజుపల్లి, గర్రెపల్లి, నారాయణపూర్, నీరుకుల్ల గ్రామాల్లో డీఎంఎఫ్‌టీ నిధులతో మహిళ సమైఖ్య భవనాలను నిర్మించేందుకు 2020లో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అరకొర నిధులతో కాంట్రాక్టర్లు స్లాబ్‌వరకే నిర్మించి వదిలేశారు. కాని ఏళ్లు గడుస్తున్నా తమ భవనాలు ఎప్పుడు పూర్తవుతాయోనని మహిళా సంఘం సభ్యులు, ప్రతినిధులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

ఎన్టీపీసీ బూడిద టెండర్‌ను విరమించుకోవాలి

రామగుండం: ఈనెల 17న ఎన్టీపీసీ బూడిదను విక్రయించేందుకు టెండర్ నిర్ణయాన్ని విరమించుకోవాలని, ఇటుక బట్టీల నిర్వాహకులకు ఉచితంగా బూడిద తరలించుకునే వెలుసుబాటు కల్పించాలని కుందనపల్లి మాజీ సర్పంచ్ మేకల సరస్వతీ కోరారు. ఉచిత బూడిద సరఫరాతో తక్కువ ధరతో ఇటుకలు తయారవుతాయని దీంతో భవన నిర్మాణంపై ఆర్థిక భారం తగ్గుతుందని, వేలాదిమంది కూలీలకు ఉపాధి దొరుకుతుందన్నారు.

మహిళలకు ఎస్‌బీఐ తోడ్పాటు

రామగిరి: స్వశక్తి మహిళా సంఘాల గ్రూపుల్లోని మహిళలు స్వయంకృషితో ఆర్థికంగా ఎదగాలని ఎస్‌బీఐ ముత్తారం బ్రాంచ్ మేనేజర్ సంపత్‌రాజ్ సూచించారు. మండలకేంద్రంలోని రుద్రమ స్వశక్తి మహిళా సంఘం భవనంలో ఏర్పాటుచేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎస్‌బీఐ బ్యాంకు ప్రోత్సాహిస్తోందన్నారు. తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నామని స్వశక్తి సంఘాల మహిళలు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ఐకేపీ ఏపీఎం పద్మను శాలువాతో సన్మానించారు. బ్యాంక్ సిబ్బంది, ఐకేపీ సిబ్బ ంది, స్వశక్తి సంఘాల మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధికి జెడ్పీచైర్మన్ కృషి

రామగిరి: మండల అభివృద్ధికి జెడ్పీచైర్మన్ పుట్టమధు నిరంతరం కృషి చేస్తున్నాడని జెడ్పీటీసీ శారద తెలిపారు. మండలంలోని నవాబ్‌పేట, బేగంపేట గ్రామాల్లో ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్లు నిర్మాణాలను బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. మండలానికి రూ 3.కోట్లు ఈజీఎస్ నిధులుకేటాయించారన్నారు. నవాబ్‌పేట్‌లో రూ. 25 లక్షలు, బేగంపేటలో రూ.20 లక్షల నిధులతో సీసీరోడ్లు నిర్మిస్తున్నట్లు వివరించారు. పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా పుట్ట మధుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీదేవి, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శెంకేశి రవిందర్, ఎంపీటీసీ, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు

ఓదెల: మండలంలోని హరిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి మంగళవారం రాత్రి పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో విద్యార్థులు ఆటపాటలతో డీజే డ్యాన్సులతో అలరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఓదెల జెడ్పీటీసీ గంట రాములు యాదవ్, సర్పంచ్ గుండేటి మధు, ఉపసర్పంచు గ్యారవేని నాగరాజు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ అమ్ముల భిక్షపతి, హెచ్ఎం మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

సుల్తానాబాద్: లయన్స్ క్లబ్ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో కీర్తిశేషులు వలస కాంతమ్మ- వలస వీరేశం జ్ఞాపకార్థం వలస నీలయ్య- స్వరూప సౌజన్యంతో చలివేంద్రం ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కోడూరు సతీశ్, మిట్టపల్లి ప్రవీణ్, జూలూరి అశోక్ పిట్టల వెంకన్న, రాయుళ్ల నవీన్ కుమార్, నోముల శ్రీనివాసరెడ్డి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు

లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

సుల్తానాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏబీవీపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అజయ్ డిమాండ్ చేశారు. బుధవారం సుల్తానాబాద్‌లో సమావేశంనిర్వహించి మాట్లాడారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగులు, విద్యార్థులు, అభ్యర్థులకు చేసిందేమి లేదన్నారు. ఎన్నోఏళ్లుగా పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ప్రశ్నపత్రాల లీకేజీతో నిరుద్యోగుల నోట్లో మట్టికొట్టారని, కాంట్రాక్ట్‌ఉద్యోగులు ప్రభుత్వంకుమ్మక్కై వందలకోట్లు దండుకునేందుకు యత్నించారన్నారు ఆరేళ్లుగా జరిగిన అవకతవకలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. జిల్లా కన్వీనర్ రాసురి ప్రవీణ్, నాయకులు రిషి, సాయి, సందీప్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

రామగుండం: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీకి రాష్ట్రప్రభుత్వం బాధ్యత వహించాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) జిల్లా అధ్యక్షుడు పెండ్యాల రమేశ్ అన్నారు. అంతర్గాం మండలకేంద్రంలోని ప్రజాపంథా కార్యాలయంలో మాట్లాడారు. ఉద్యోగ నోటిఫికేషన్ల ద్వారా ప్రభుత్వానికి కోట్ల ఆదాయం సమకూరుతోందన్నారు. రాత్రింబవళ్లు కష్టపడి చదువుకున్న వారికి ప్రశ్నపత్రాలు లీక్ కావడంతో వారి జీవితాలు అగమ్యగోచరంగా మారాయన్నారు నాయకులు గుమ్మడి వెంకన్న, తీగుట్ల రాములు, కట్ట తేజేశ్వర్, పోచయ్య, విజయ్ తదితరులున్నారు.

రాజ్‌ఠాకూర్ కుటుంబం ఆదర్శం

రామగుండం: గుండెపోటుతో చనిపోయిన శైలేందర్‌సింగ్‌ఠాకూర్ నేత్రాలను దానంచేసిన ఆయన కుటుంబసభ్యులు ఆదర్శనీయులని సదాశయ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రావణ్‌కుమార్, సీహెచ్.లింగమూర్తి అన్నారు. ఈనెల 3న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సోదరుడు శైలేందర్‌సింగ్ గుండెపోటుతో చనిపోయిన విషయం తెల్సిందే. ఆయన కుటుంబసభ్యులు అదేరోజు సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులకు సమాచారమివ్వగా.. వారు కళ్లు సేకరించారు. నేత్రదానానికి ముందుకువచ్చిన ఆయన కుటుంబ సభ్యులను ఫౌండేషన్ ప్రతినిధులు మారెల్లి రాజిరెడ్డి, రఘుపతి, అన్నపూర్ణ, జ్యోతి, తిరుమల, బైరి శ్రీనివాస్ బుధవారం అభినందించారు.

డైరెక్టర్ సతీమణికి సన్మానం

రామగిరి: సింగరేణి సంస్థ ఏపీఏ జీఎంగా విధులు నిర్వహిస్తూ ఇటీవల డైరెక్టర్(ఆపరేషన్స్)గా ఎంపికైన ఎన్‌వీకే. శ్రీనివాస్ సతీమణి కల్యాణిని ఆర్జీ3, ఏపీఏ లేడీస్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. సెంటినరీకాలనీలోని సీఎస్‌సీవోఏ క్లబ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు తన్నీరు శ్రీదేవి, కొప్పుల విజయ ఇతర సభ్యులు శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందించి వీడ్కోలు పలికారు. ఆర్జీ1, ఆర్జీ2 లేడీస్‌క్లబ్ అధ్యక్షురాలు కె.పద్మ, ఐత సవితా, ఎస్.జయ, పద్మ, లేడీస్‌క్లబ్ సెక్రెటరీ సుజాత, సభ్యులు హరిణి, శ్రీలత, లావణ్య, నిఖిత, కోమలి పాల్గొన్నారు.



ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం

పెద్దపల్లిరూరల్: మండలంలోని రాఘవాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణను బుధవారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శుభ్రంచేశారు. పిచ్చిమొక్కలు తొలగించారు. గ్రామంలో మంగళవారం నుంచి మొదలైన ఈ శిబిరం వారం రోజులు కొనసాగుతుందని ప్రోగ్రాం అధికారి సమద్ తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ మధుసూదన్, ఎక్స్‌టెన్షన్‌మీడియా ఆఫీసర్ వెంకటేశ్వర్లు టీబీ లక్షణాలపై పలు అంశాలపై అవగాహన కల్పించారు.

‘కంటివెలుగు’ సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎలిగేడు: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘కంటివెలుగు’ వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి నిస్సీ క్రిస్టీనా తెలిపారు. బుర్హాన్‌మియాపేటలో బుధవారం ‘కంటివెలుగు’ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో 131మందికి కంటిపరీక్షలు చేసి 36 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాచర్ల కొండయ్య వైద్యసిబ్బంది పాల్గొన్నారు.